ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మోమిన్‌పేట్	8.7
రంగారెడ్డి	మంగల్‌పల్లి	10.1
మేడ్చల్	మూడుచింతలపల్లి	11.6





హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డును పరిశీలిస్తున్న సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్‌రాజు

బీజాపూర్ హైవే విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

- మార్చి వరకు బైపాస్ పనులు పూర్తి
- సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్‌రాజు

చేవెళ్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వేగం పెంచాలని సీఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్‌రాజు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం హైవే విస్తరణ పనులు, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల మీదుగా వెళ్తున్న బైపాస్ రోడ్డు పనులను పరిశీలించారు. ఇటీవల చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ గేట్ సమీపంలో జరిగిన బస్సు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రోడ్డు విస్తరణకు భూ సేకరణ గురించి ఆర్డీవో చంద్రకళను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మీర్జాగూడ బస్సు ప్రమాదం బాధాకరమన్నారు. మార్చి వరకు చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో ఉన్న బై పాస్ రోడ్డు పనులు పూర్తి అవుతాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట చేవెళ్ల, మొయినాబాద్ తహసీల్దార్లు కృష్ణయ్య, గౌతమ్‌కుమార్, ఎన్‌హెచ్ అధికారులు తదితరులు ఉన్నారు.


మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌వో సంగీత

యాచారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా డీఆర్‌వో సంగీత కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా అధికారులతో ఆమె మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. మత్తు పదార్థాల వినియోగం సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరముందన్నారు. విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి శ్రీలత, డీపీవో సురేష్‌మోహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి, మెప్మా పీడీ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

త్వరలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పల్లెల్లో మళ్లీ రాజకీయ సందడి మొదలైంది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు, సుప్రీం కోర్టు తప్పు పట్టిన సంగతి తెలిసిందే. దీంతో మళ్లీ పాత రిజర్వేషన్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. సోమవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత పంచాయతీ, తరువాత పరిషత్ ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది.



పల్లెల్లో మళ్లీ సందడి

స్థానిక ఎన్నికలకు సర్కార్ సన్నాహాలు

- మొదట పంచాయతీ.. ఆ తర్వాతే ప్రాదేశికం
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు
- రెండు విడతల్లో జరగనున్న ఎలక్షన్స్
- అధికార యంత్రాగం సన్నద్ధం
- డిసెంబరు రెండో వారంలో షెడ్యూల్ విడుదలకు అవకాశం

మారనున్న రిజర్వేషన్లు

మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పాత విధానంలోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే పంచాయతీ ఎన్నికలను ముందుగా నిర్వహిస్తుండటంతో ఇటీవల సర్పంచ్, వార్డులకు ప్రకటించిన రిజర్వేషన్లన్నీ మళ్లీ మారనున్నాయి. అలాగే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది.

రంగారెడ్డి జిల్లా	
పంచాయతీలు	526
వార్డులు	4,668

ఓటర్ల వివరాలు	
గ్రామీణ ఓటర్లు	7,52,259
పురుషులు	3,76,873
మహిళలు	3,75,408
ఇతరులు	28

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): సుప్రీం కోర్టు సూచనల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పాత విధానంలోనే మళ్లీ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాల్సి రావడం కాంగ్రెస్ సర్కార్‌కు కొంత ఇరకాటంగానే మారింది. దీన్ని అధిగమించేందుకు పార్టీలతో సంబంధం లేకుండా జరిగే పంచాయతీ ఎన్నికలను ముందు నిర్వహించాలని సర్కార్ నిర్ణయించింది. ఇదిలా ఉంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై కోర్టు తీర్పులు కొలిక్కి వచ్చాకే ప్రాదేశిక ఎన్నికలపై తదుపరి నిర్ణయం తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించింది. అపుడు కూడా న్యాయస్థానాల్లో వ్యతిరేకంగా తీర్పులు వస్తే పార్టీ పరంగా 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందుగా ప్రభుత్వం తాము చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

పథకాలపై విస్తృత ప్రచారం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా డిసెంబరు ఒకటి నుంచి 9వ తేదీ వరకు ప్రజా పాలన వారోత్సవాలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు ఆకర్షించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో

మిగతా 7వ పేజీలో...

యాసంగికి అందుబాటులో ఎరువులు, విత్తనాలు

జిల్లా వ్యవసాయాధికారి ఉష



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఏవో ఉష

ఇబ్రహీంపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యాసంగి సాగుకు సంబంధించి జిల్లాలో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఉష అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం, మండలంలోని దండుమైలారం, పోల్కంపల్లి పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. దండుమైలారం, పోల్కంపల్లి పీఏసీఎస్‌లలో యూరియా నిల్వలను పరిశీలించారు. డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. దండుమైలారంలో సిబ్బంది, రైతులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విద్యాధరి, ఏఈవో శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

పెట్టుబడుల హబ్‌గా హైదరాబాద్
రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
7
ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థిక భరోసా
కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి







వాక్‌వజామున లేలేత సోయగం

తెలతెల్లవారంగా మంచుతెరలు తొలగే సమయాన భానుడి లేలేత కిరణాల అందాలు మంత్ర ముగ్ధులను చేశాయి. శీతాకాలం మంచు దుప్పటిని చీల్చుకుంటూ వస్తున్న భానుడు అరుణవర్ణ శోభితమై నేలను ముద్దాడాడు. చలి గిలిగింతల నుంచి బయటపడిన ప్రజలు మైదానాల్లో వాకింగ్ చేస్తూ సుందర దృశ్యాలను సృషిస్తూ ముందుకు సాగారు. మంగళవారం తుక్కుగూడ, శంషాబాద్, షాద్‌నగర్‌లో ఈ దృశ్యాలు ఆవిష్కృతమవగా 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి

లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాడుతాం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న భాస్కర్

ఇబ్రహీంపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దయ్యే వరకూ పోరాడాల్సిన అవసరముందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో రెండ్రోజుల పాటు జరిగిన తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ 4వ రాష్ట్ర మహా సభల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సభలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎలమోని స్వప్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీ రమ, ఉపాధ్యక్షుడిగా ఉన్ని కృష్ణ, కోశాధికారిగా బాలలక్ష్మి, 15 మందిని ఆఫీస్ బేరర్స్‌గా, 39 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు.

టెర్మినల్‌ను పేల్చేస్తాం

మరోసారి ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్

అప్రమత్తమైన భద్రతా బలగాలు.. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు

శంషాబాద్ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్‌ను పేల్చేస్తామని గుర్తు తెలియని దుండగులు మంగళవారం జీఎంఆర్‌కు మెయిల్ పంపారు. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం 10.05 గంటలకు జీఎంఆర్ కస్టమర్ సపోర్టుకు మెయిల్ వచ్చినట్లు గుర్తించిన అధికారులు వెంటనే భద్రతా బలగాలకు సమాచారం అందించారు. అప్రమత్తమైన భద్రతా బలగాలు బాంబు, డాగ్ స్క్వాడ్‌లు టెర్మినల్‌లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి బాంబులు లేవని తేల్చుకొని ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని రోజులుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్స్, కాల్స్ చాలా ఎక్కువయ్యాయి. అయినా నిందితులు పదేపదే బెదిరింపు మెయిల్స్, కాల్స్ చేస్తున్నారు. ఇప్పటివరకు ఒక నిందితుడిని కూడా ఎయిర్‌పోర్టు పోలీసులు అరెస్టు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, పోలీసులు బెదిరింపు మెయిల్స్ నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.



'ఎయిర్ ఇండియా' ఎమర్జెన్సీ ల్యాండింగ్

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఢిల్లీ వెళ్తున్న ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండైంది. వివరాల్లోకి వెళ్తే.. 156 మంది ప్రయాణికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మంగళవారం 12.20 గంటలకు టేకాఫ్ తీసుకుని ఢిల్లీ బయలుదేరిన ఏఐ 2776 ఎయిర్ ఇండియా విమానం 35 నిమిషాల తర్వాత ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయాణికులు భయందోళనకు గురయ్యారు. విమానంలో ఏం జరుగుతోంది? అనేది అర్థం కావడం లేదు. గమనించిన పైలెట్ శంషాబాద్ ఏటీసీ (ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఏటీసీ అధికారులు ఇతర విమానాలను ఆపి ఎయిర్ ఇండియా విమానం ఎమర్జెన్సీకి అనుమతినిచ్చారు. దీంతో అర్ధరాత్రి 12 గంటలకు తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండైంది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రయాణికులను ఎయిర్‌పోర్టులోని లాంజ్‌లోకి పంపించారు. విమానం మరమ్మతుల అనంతరం మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు 149 మంది ప్రయాణికులతో ఢిల్లీ బయలుదేరింది. మరో ఏడుగురు ప్రయాణికులు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. ఏడుగురి టికెట్ డబ్బులు వాపస్ ఇచ్చారు ఎయిర్‌లైన్స్ అధికారులు. ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నడంతో ఆందోళన వ్యక్తం చేశారు.

యువజనోద్యమాలతో సామాజిక మార్పు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల్లో చాలావరకు కార్పొరేట్ రాజకీయాలు నడుస్తున్నాయని, బలమైన యువజనోద్యమాలతో సామాజిక మార్పు వస్తుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. 2026 జనవరి 18, 19, 20 తేదీల్లో జరుగనున్న డీవైఎఫ్ఐ 3వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం ఇబ్రహీంపట్నంలోని శ్రీ కళా కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. అందరికీ విద్య వైద్యం, ఉపాధి కోసం నిరంతర ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. అందరికీ న్యాయం జరగాలంటే సోషలిస్టు ప్రభుత్వాలతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. వచ్చే జనవరిలో జరగనున్న డీవైఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కార్యదర్శి పి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

ముద్విన్‌లో రోడ్డెక్కిన విద్యార్థులు



ముద్విన్‌లో రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

కడ్తాల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేస్తూ కడ్తాల మండలం ముద్విన్ గ్రామంలో విద్యార్థులు రోడ్డెక్కారు. ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేసే ప్రవీణను హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు. మరో ఫిజిక్స్ టీచర్ జీహెచ్ఎంగా పదోన్నతి పొంది నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో మూడు నెలలుగా ఫిజిక్స్ టీచర్ లేక 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్, డీఈవో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం విద్యార్థులు పాఠశాల నుంచి ర్యాలీగా కర్కల్ పహాడ్ - మాల్ ప్రధాన రహదారిపైకి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. బస్టాండ్ కూడలిలో బైటాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో టీచర్ లేక నష్టపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫిజిక్స్ టీచర్‌ను నియమించాలని నినాదాలు చేశారు. ఉపాధ్యాయుడిని నియమించేవరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో ప్రధాన రహదారిపై కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక నాయకుడు గంట నరేశ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని తెలుపడంతో విద్యార్థులు ఆందోళనను విరమించి పాఠశాలకు చేరుకున్నారు.

జిన్నింగ్ మిల్లుల బంద్ విరమణ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధనలను సడలించేందుకు ముందుకు రావడంతో తమ జిన్నింగ్ మిల్లుల బంద్‌ను విరమిస్తున్నట్టు మంగళవారం తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించింది. సీసీఐ లీజుకు తీసుకున్న మిల్లులన్నీ ఓపెన్ చేయాలని, రైతు నుంచి ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయాలని, రైతు ఎక్కడైనా విక్రయించుకునే స్వేచ్ఛ ఇవ్వాలన్న డిమాండ్లతో యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక బంద్‌కు పూనుకున్న విషయం తెలిసిందే. దీంతో మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్‌రావు, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్, కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రమేష్ హైదరాబాద్ సెక్రటరియేట్‌లో సమావేశమై, సమస్యలపై చర్చించారు. చర్చలు సఫలం కావడంతో బుధవారం నుంచి సీసీఐ పత్తిని అన్‌లోడ్ చేసుకుని, జిన్నింగ్ చేస్తామని షాద్‌నగర్ రాఘవేంద్ర కాటన్ జిన్నింగ్ మిల్లు యజమాని నర్సింహులు తెలిపారు. రైతులు అమ్మకానికి పత్తిని తీసుకురావాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ శాఖ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ శ్రీనివాస్ కోరారు.

నిబంధనలు ఎత్తేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలి



ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీసీఐ నిబంధనలను తొలగించి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, సీసీఐ నిబంధనలతో రైతులను వేదనకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. తర్నికల్‌లో సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఆమనగల్లు, మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి, తలకొండపల్లి మండలాల రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకపోగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్మ సత్యం, పత్యానాయక్, అర్జున్‌రావు, పి.రవి, మనోహర్‌రెడ్డి, వెంకటయ్య, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతిని కలిసిన రవికాంత్‌రెడ్డి



కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి సోమవారం రాత్రి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న రవికాంత్‌రెడ్డి రాధాకృష్ణన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



మహేశ్‌కు చెక్కును అందజేస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

శామీర్‌పేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు దివ్యాంగ క్రీడాకారుడు ధీరవత్ మహేశ్‌కు అధికారులు ఆర్థిక సాయం అందజేశారు. మూడుచింతలపల్లి మండలం లింగాపూర్‌తండాకు చెందిన మహేశ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగిన వివిధ పారా క్రీడా పోటీల్లో పాల్గొని 3 బంగారు, 5 వెండి, 3 కాంస్య పతకాలను సాధించాడు. శ్రీలంకలో జరగనున్న దివ్యాంగ జూనియర్ త్రోబాల్ పోటీల్లో జాతీయ జట్టుకు మహేశ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. శ్రీలంక వెళ్లేందుకు రూ.59వేల ఆర్థిక సాయానికి అర్థించాడు. మహేశ్ అభ్యర్థనను మంగళవారం మేడ్చల్ జిల్లా క్రీడాధికారి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిశ్రమల అధికారులు, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఇండియా పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేరిట రూ.59వేల చెక్కును మహేశ్‌కు అందజేశారు.

పెట్టుబడుల హబ్‌గా హైదరాబాద్

» రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కె.వెంకటరెడ్డి



చేవెళ్ల/శంకర్‌పల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణం పూర్తయితే రానున్న రోజుల్లో హైదరాబాద్ పెట్టుబడులకు హబ్‌గా మారుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామం మియాఖాన్ గడ్డలో మంగళవారం త్రయ వాల్‌డ్రాఫ్ ఇన్‌స్పైర్డ్ ప్రైవేటు స్కూల్‌ను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ పైసంగతి చెప్పారు. ఏడాదిలోగా ఆర్ఆర్ఆర్ పనుల ప్రారంభానికి టెండర్లను పిలుస్తామని తెలిపారు. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రోడ్డు పనులకు అడ్డంకులు తొలగడంతో రోడ్డు పనులు జరుగుతున్నాయన్న మంత్రి కోమటిరెడ్డి.. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు అభివృద్ధిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. రోజురోజుకు ట్రాఫిక్ పెరిగిపోయిందని, ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ సమీప చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో రోడ్ల నిర్మాణానికి రూ.250 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్న కోమటి రెడ్డి.. అందులో భాగంగానే కౌకుంట్ల గ్రామానికి డబుల్ రోడ్డు మంజూరు చేశామన్నారు. గ్రామీణాభివృద్ధి దిశగా తమ సర్కారు ముందుకు సాగుతుందని, రాజకీయాలకతీతంగా గ్రామీణ రోడ్లను నిర్మిస్తామన్నారు.

రోడ్డు మధ్యలోని స్తంభాల తొలగింపు

» రహదారి పక్కన కొత్త పోళ్ల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉందని ఈ నెల 9న ఆంధ్రజ్యోతిలో 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన వచ్చిన కథనానికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, నాయకులు, ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. మంగళవారం స్తంభాలను రోడ్డు మధ్య నుంచి తొలగించి దూరంగా పాతే పనులకు శ్రీకారం చుట్టారు. ఆమనగల్లు-మాడ్గుల రోడ్డులో సందబావి నుంచి తలకొండపల్లి వరకు రెండు లేన్ల రోడ్డు పనులు జరుగుతున్నాయి. 50ఫీట్లకు రోడ్డు వెడల్పు చేసి డివైడర్లు ఏర్పాటు చేశారు. గతంలో రోడ్డు పక్కనున్న స్తంభాలతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎస్‌టీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ దుర్గయ్య, నాయకులు చొరవ తీసుకొని రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. మంగళవారం ఆరు పోళ్లను కొత్తగా పాతారు. అన్ని స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని ట్రాన్స్‌కో డీఈ బాలకృష్ణ, ఏఈ శంకర్‌నాయక్ తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠశాల, కళాశాలల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్, క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయాలకు రావడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొంటే ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. ముఖ్య అతిథి ఎస్ఏపీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పి.విజయగోపాల్ మాట్లాడుతూ, విజ్ఞానమనేది మనం చెబితే తప్ప ఎవరూ దోచుకునేందుకు వీలులేనిదన్నారు. విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలకు 120మంది పాఠశాల, కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పేరం సురేష్‌బాబు, న్యాయ నిర్ణేతలు శ్రీనివాస్, సి.రాములు, వ్యాఖ్యాత ఎం.అశోక్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మరకత శివలింగాన్ని దర్శించుకున్న సినీ నటి రోజా భారతి



రోజా భారతికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందిప్పలో గల ఆలయంలోని మరకత శివలింగాన్ని 'సీతా ప్రయాణం కృష్ణ'తో సినిమా యూనిట్ సభ్యులు మంగళవారం దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్, సినిమా నిర్మాత ఖుషీ టాకీస్ అధినేత సీనియర్ యాక్టర్ రోజా భారతి, యూనిట్ సభ్యులకు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్ స్వామి, వైస్‌చైర్మన్ శేఖర్ సత్కరించారు. స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కళాశాలలో విద్యార్థుల మధ్య గొడవ

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ పరిధి ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలోని మిటామైండ్ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం గొడవపడ్డారు. ఆర్జీఐఏ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం క్రికెట్ ఆడే సమయంలో బాల్ తగిలిందని సీనియర్ విద్యార్థులు మనస్సులో పెట్టుకున్నారు. సాయంత్రం జూనియర్ల క్లాస్ రూమ్‌లోకి వెళ్లి గొడవకు దిగారు. దాడులు చేసుకునేంత వరకు వెళ్లింది. కళాశాల యాజమాన్యం 100కు కాల్ చేసింది. పోలీసులు చేరుకొని విద్యార్థులను అక్కడి నుంచి పంపించారు. సీనియర్, జూనియర్ విద్యార్థులు కొట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఫిర్యాదు రాలేదని సీఐ బాల్‌రాజ్ తెలిపారు. కాగా విద్యార్థుల గొడవ విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. అనుమతులు లేని కళాశాలను ఎలా నడిపిస్తారని ప్రశ్నించారు. గతంలో కూడా చాలసార్లు మిటామైండ్‌లో గొడవలు జరిగాయని చెప్పారు.

ఏఐసీసీ కార్యదర్శికి ఘన స్వాగతం

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితులైన ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మంగళవారం రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ యాదవ్‌లు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. సావంత్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, బొబ్బిలి శేఖర్, నజీర్, రమేశ్, కుమార్, ప్రవీణ్‌యాదవ్, రవినాయక్, సంజీవ్‌రెడ్డి, మిట్టు, ఉమ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మళ్లీ సందడి

(ఐదో పేజీ తరువాయి)

గ్లోబల్ సమ్మిట్‌ను సైతం పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. వీటిపై ప్రభుత్వం విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల తరువాత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ విడుదల లోపుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ ప్రచారం చేయాలని పార్టీ స్థానిక నేతలకు ఆదేశాలు జారీ చేసింది.

అధికార యంత్రాగం సన్నద్ధం

స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావడంతో జిల్లా అధికార యంత్రాంగం కూడా ఎన్నికల నిర్వాహణకు సన్నద్ధమవుతోంది. ఇటీవలే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలై నామినేషన్ల పక్రియ మొదలైన తరువాత న్యాయస్థానం ఆదేశాలతో ఈ పక్రియ అర్థంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే. అయితే ఇపుడు ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను ముందు నిర్వహించాలని నిర్ణయించడంతో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ వార్డుల పునర్విభజనచేసి ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. రిటర్నింగ్ అధికారులతో పాటు ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల నియామకం జరిగింది. బ్యాలెట్



బాక్సులు సిద్ధంగా ఉన్నాయి. బ్యాలెట్ పత్రాలకు సంబంధించి సర్పంచులకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుగు రంగులో ముద్రించనున్నారు.

రెండు దశల్లో పంచాయతీ ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలు రంగారెడ్డి, వికారాబాద్ రెండు జిల్లాల్లోనూ రెండు విడతల్లో జరగనున్నాయి. రంగారెడ్డి జిల్లాలో తొలి విడత చేవెళ్ల, కందుకూరు, రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 264 పంచాయతీలు, 2,300 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే రెండో విడత మిగతా రెవెన్యూ డివిజన్లలోని 262 పంచాయతీలు, 2,368 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో తొలి విడతలో 11 మండలాల్లోని 288 పంచాయతీలు, 2,490 వార్డు స్థానాలకు అలాగే రెండో విడతలో 9 మండలాల్లోని 306 పంచాయతీలు, 2,568 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

అత్యధికంగా ఫరూఖ్‌నగర్ మండలంలో..

తుది ఓటరు జాబితా ప్రకారం రంగారెడ్డి జిల్లాలో 7,52,259 మంది గ్రామీణ ఓటర్లు ఉండగా, వీరిలో 3,76,873 మంది పురుషులు, 3,75,408 మంది మహిళలు, 28 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో అత్యధికంగా 51,104 మంది ఓటర్లు, అత్యల్పంగా ఆమన్‌గల్‌లో 14,712 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే వికారాబాద్ జిల్లాలో మొత్తం 6,98,472 గ్రామీణ ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,43,668, మహిళలు 3,54,788, ఇతర ఓటర్లు 16 మంది ఉన్నారు.

పంచాయతీ పాలన అస్తవ్యస్తం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయి గ్రామీణ ప్రాంతాల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. 2024, ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలకవర్గాల పాలన ముగియగా, అదే ఏడాది జూలై నెలలో మండల పరిషత్తులు, జెడ్పీ పాలక వర్గం గడువు సైతం ముగిసిన విషయం తెలిసిందే. స్థానిక సంస్థల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగిస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పంచాయతీలు, జెడ్పీ, మండల పరిషత్తులలో ప్రత్యేకాధికారుల పాలననే కొనసాగుతోంది. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయి పాలన దుర్భరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల విషయం ఎలా ఉన్నా.. ప్రజలకు కనీస సదుపాయాలను కూడా కల్పించలేకపోతున్నారు. ప్రజల నుంచి వసూలయ్యే పన్నులతోనే పంచాయతీల్లో కార్మికుల వేతనాలు, అత్యవసర పనులు చేపడుతుండటం గమనార్హం.

రూ.2కోట్లకుపైగా అప్పు చేసి పరార్

» లబోదిబోమంటున్న బాధితులు

కులకచర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో విజయ్ జ్యువెలరీ షాపు యజమాని వద్ద బంగారాన్ని తాకట్టు పెట్టుకొని రూ.2కోట్లకుపైగా అప్పులు తీసుకోగా గుట్టు చప్పుడు కాకుండా షాపు మూసి పరారయ్యాడు. ఎస్సై రమేశ్‌కుమార్, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. రాజస్థాన్‌కు చెందిన నరేందర్ కొన్నేళ్ల క్రితం అజయ్ జ్యువెలర్ షాపు పెట్టి ప్రజల బంగారు తాకట్టుపెట్టుకొని వడ్డీకి డబ్బులిస్తున్నాడు. వందలాది మంది అతడి వద్ద బంగారాన్ని తాకట్టుపెట్టి రూ.2కోట్లకుపైగా అప్పు తీసుకున్నారు. చెరువుముందలి తండా(కె)కు చెందిన రఘునాయక్ ఈ నెల 14న తన పాత బంగారం 30 గ్రాములిచ్చి మరో 50గ్రాములు కలిపి అభరణం చేయాలని అడ్వాన్స్‌గా రూ.1.35లక్షలు ఫోన్‌పే చేశాడు. 16న వస్తే ఇస్తానని నరేందర్ చెప్పాడు. సోమవారం రఘు షాపునకు రాగా మూసి ఉంది. శనివారం రాత్రే షాపు ఖాళీ చేసి కుటుంబంతో పరారయ్యాడని తెలిసింది. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గోరిగడ్డ తండాకు చెందిన గోపాల్ నాయక్ నరేందర్‌కు రూ.10లక్షలు అప్పిచ్చాడు. నరేందర్ పాట్ కాగితాలు కుదవ పెట్టి మరోవ్యక్తి వద్ద రూ.10లక్షలు అప్పుతీసుకున్నాడు. వందల మంది జువెలర్ షాపులో బంగారు తాకట్టు పెట్టారు. రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ తోడ్పాటుతో ఆర్థిక భరోసా

ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, తోడ్పాటుతో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మహిళా సంక్షేమం, భద్రత, ఉపాధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. కడ్తాల ఎంబీఏ గార్డెన్‌లో తలకొండపల్లి, కడ్తాల మండలాల 84 మంది లబ్ధిదారులకు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, తహసీల్దార్ జయశ్రీ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు



కడ్తాలలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ముర్తోజుపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

శ్రీనివాస్‌రెడ్డిలతో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషిచేస్తామని యువకులు, నాయకులతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ముర్తోజుపల్లిలో కర్నాటి అనితనాగార్జునరెడ్డి ఇందిరమ్మ ఇంటిని మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌లతో కలిసి ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనాదక్షతతో రెండేళ్లలో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందన్నారు. ఓర్వలేని విపక్షాలు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని మండిపడ్డారు. స్థానికంగా సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కర్నాటి శ్రీధర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రాములు, యాట నర్సింహ, తహసీల్దార్లు రమేశ్, ఫయ్యాంఖాద్రీ, ఎంపీడీవోలు సుజాత, మాధురి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో మహిళ హల్‌చల్



ఎయిర్‌పోర్టులో హల్‌చల్ చేసిన మతిస్థిమితం లేని మహిళ

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఓ మహిళ హల్‌చల్ చేసిన సంఘటన మంగళవారం ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన దేవమణి పేజ్(35) ఎయిర్‌పోర్టులోని అరైవల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరించగా సీఐఎస్ఎఫ్ అధికారులు ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. ఆమె మానసిక స్థితి బాగలేదని పోలీసులు తెలిపారు. అధికారులపై ఆమె దురుసుగా ప్రవర్తించింది. ఆధార్ కార్డు వివరాల ప్రకారం ఆమె జిల్లా, ఊరు పేర్లు తెలిశాయి. కానీ మాట్లాడలేని స్థితిలో ఉందని పోలీసులు గుర్తించారు. ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్ కొనసాగుతున్న నేపథ్యంలో అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. మహిళకు సంబంధించిన వారు ఎవరైనా వస్తే అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. మహిళను పోలీస్ స్టేషన్‌లో అప్పగించే సమయంలో ఆర్జీఐఏ ఔట్‌పోస్టు స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ లేక సీఐఎస్ఎఫ్ అధికారులు అసహనం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో రాత్రిపూట మహిళా కానిస్టేబుల్ లేకపోవడం ఏమిటని విధుల్లో ఉన్న అధికారులను ప్రశ్నించారు.

విమానంలో ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

» చికిత్స అనంతరం స్వస్థలానికి...

శంషాబాద్ రూరల్: కొలంబో నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ1182 ఇండిగో విమానంలో లోహిత్ శ్రీకాంత్(63) అనే ప్రయాణికుడికి వాంతులు, విరేచనాలు కావడంతో పైలట్ ఏటీసీకి సమాచారం ఇచ్చి ఏఎంసీ(ఎమర్జెన్సీ మెడికల్ సిబ్బంది)ని అలర్ట్ చేశారు. విమానం 4.16గంటలకు ఎయిర్‌పోర్టులో ల్యాండైంది. అప్పటికే అపోలో ఏఎంసీ సిబ్బంది ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వైద్యం అందించిన డాక్టర్లు అతడి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. కాగా నిర్ణీత సమయం కంటే 15నిమిషాల ముందు విమానం ల్యాండైంది. చికిత్స అనంతరం లోహిత్ శ్రీకాంత్ స్వస్థలానికి వెళ్లిపోయారు.

విమానాన్ని ఢీకొన్న పక్షి?

శంషాబాద్ రూరల్: ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానాన్ని పక్షి ఢీకొట్టిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఢిల్లీ నుంచి వస్తున్న 6ఈ1793 ఇండిగో విమానం ఉదయం 8.15గంటలకు శంషాబాద్‌లో ల్యాండ్ అవుతుండగా పక్షి ఢీకొన్నట్టు అనుమానించిన పైలెట్ ఏటీసీకి సమాచారం ఇచ్చాడు. అప్రమత్తమైన అధికారులు విమానం సురక్షితంగా ల్యాండైన తరువాత రన్‌వేను పరిశీలించారు. అక్కడ ఎలాంటి పక్షి ఆనవాళ్లు లేవని ప్రకటించారు. అలాగే విమానం రెక్కలు, బాడీ ఎక్కడా డ్యామేజ్ కాలేదని అధికారులు నిర్ధారించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ ఎజెండా

బస్సు జాతలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



సీపీఐ బస్సు జాతలో అభివాదం చేస్తున్న నాయకురాలు పద్మ

వికారాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పోరాటాలు చేస్తూ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసిన చరిత్ర సీపీఐదని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. మంగళవారం వికారాబాద్‌కు వచ్చిన సీపీఐ బస్సు జాతాకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జాతకు నాయకత్వం వహిస్తున్న పద్మ మాట్లాడుతూ.. ప్రజల కోసం పార్టీ నాయకులు ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు, బలిదానాలను చేశారన్నారు. ప్రజాపోరాటాలతో హక్కులు సాధించారని, ఉపాధి హామీ, సమాచార హక్కు చట్టం వంటివి ఈ కోవలోనివే అని గుర్తు చేశారు. దేశాన్ని శాసిస్తున్న అంబానీ, అదానీలతో పభుత్వ సంస్థలన్నీ నిర్వీర్యమయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సీపీఐ నాయకత్వం వహించి పేదలకు భూమి పంచిందని, 10వేల గ్రామాలను రజాకార్ల చెరనుంచి విడిపించిందని తెలిపారు. ఈ నెల 15న బాసర నుంచి ప్రారంభమైన బస్సు జాత డిసెంబరు 26న ఖమ్మంలో నిర్వహించే బహిరంగ సభతో ముగిస్తుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీపండిత్ మాట్లాడుతూ, వందేళ్లు పూర్తి చేసుకున్న సీపీఐకి ప్రజల ఆశీర్వాదం ఉందన్నారు. ప్రజాసేవ, పోరాటాలే పార్టీ బలం అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, అనంతయ్య, వెంకటేశ్, వలీవుల్లా ఖాద్రి, సురేష్‌బాబు, జగదాంబ, నసీమాబేగం, ఖాదర్, ఏసురత్నం, చంద్రయ్య, రాజేందర్, మంగమ్మ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

లౌకిక, ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలి

చేవెళ్ల: పెట్టుబడిదారుల కోసం పని చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలని పశ్యపద్మ అన్నారు. చేవెళ్లకు చేరిన బస్సు జాతలో ఆమె మాట్లాడారు. సీపీఐ ఏర్పడి వందేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తామని, సీపీఐ శ్రేణులు, సానుభూతిపరులు తరలిరావాలని కోరారు. పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య మాట్లాడుతూ.. పేదల ఇండ్ల స్థలాల కోసం పోరాడి చేవెళ్ల, అబ్దుల్లాపూర్‌మెట్టు ప్రాంతంలో జాగలు ఇప్పించిన ఘనత సీపీఐదే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు రామస్వామి,రామకృష్ణ, ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, జంగయ్య, సుధీర్, శ్రీనివాస్, మక్బూల్, అంజయ్య, మంజుల, సుధాకర్‌గౌడ్, శివారెడ్డి, రాజేందర్‌గౌడ్, శివ, లలిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఆ సీఐలపై అటాచ్ వేటు!

● తాండూరు రూరల్ గత సీఐలపై చర్యల పరంపర ● పలు ఆరోపణల నేపథ్యంలో ఐజీ కార్యాలయానికి అటాచ్

» పైరవీతో వచ్చి వివాదాల్లోకి అధికారులు

» సీఐలు, ఎస్సైల మధ్య సమన్వయ లోపం

» ప్రస్తుత సీఐ సైతం ఐజీ ఆఫీస్‌కు అటాచ్..

» కొత్త అధికారికి బాధ్యతల అప్పగింత



తాండూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాండూరు రూరల్ పోలీసు స్టేషన్(కరణ్‌కోట)లో విధులు నిర్వర్తిస్తున్న సీఐలలో ఎక్కువ మంది అనతి కాలంలోనే ఉన్నతాధికారుల కార్యాలయానికి అటాచ్/బదిలీలు అయ్యారు. ఈ సర్కిల్ పరిధి యాలాల, పెద్దేముల్ ఎస్ఐలతో విభేదాలు, రాజకీయ ఒత్తిళ్లు, కాగ్నాలో ఇసుక అక్రమ రవాణా వంటి వివాదాల కారణంగా ఇక్కడ సీఐలపై వేటు పడుతోంది. రూరల్ సీఐ పోస్టింగ్‌ల వివరాల్లోకి వెళ్తే.. 2012 ఫిబ్రవరి 2న గౌతాపూర్ సమీపంలో రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఆ సమయంలో తాండూరు అర్బన్ సీఐ శ్రీనివాసులును అప్పటి హోంమంత్రి సబితారెడ్డి, ఐజీ రాజీవ్ రతన్‌ల సమక్షంలో కొందరు స్థానికులు సన్మానించారు. దీనిపై సీరియస్సయిన ప్రభుత్వం శ్రీనివాస్‌లును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసింది. ప్రస్తుతం ఆయన వికారాబాద్ పోలీస్ ట్రైనింగ్ డీఎస్పీగా ఉన్నారు. 2013 జనవరి 16న కస్టడీలో ఉన్న మల్లేష్ అనే నిందితుడు స్టేషన్ పైఅంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల చిత్రహింస వల్లే ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలతో సీఐలు శ్రీనివాస్, పవన్ ఉన్నతాధికారుల విచారణ ఎదుర్కొన్నారు. కాగా ఓ నాయకుడి ప్రోద్బలంతో స్టేషన్‌లో విందు చేసుకున్నారని ఐదుగురు పోలీసులను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. అటాచైన వారిలో సీఐ శ్రీనివాస్ ఉన్నారు. ప్రస్తుతం ఆయన పరిగి డీఎస్పీ. 2014లో కరన్‌కోట్ సీఐ రవికుమార్ మహబూబ్‌నగర్ క్రైం స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఎస్సై ఆత్మహత్య నేపథ్యంలో...

సంగారెడ్డి టౌన్ సీఐగా పనిచేసిన శివశంకర్ 2014లో రూరల్ సీఐగా వచ్చారు. యాలాల ఎస్సై రమేశ్ కందనెల్లిలో 2015 సెప్టెంబరు 16న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి ఆత్మహత్యకు సీఐ శివశంకర్ వేధింపులే కారణమని రమేశ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐని డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేసి సీఐడీ విచారణ చేయించారు. ఇందులో సీఐ పాత్ర లేదని తేల్చారు. అనంతరం 2015లో రూరల్ సీఐగా సైదిరెడ్డి వచ్చారు. 2016లో యాలాల ఎస్ఐ అరుణ్‌కుమార్, సీఐల మధ్య విభేదాలొచ్చాయి. 2017లో సంగెంఖుర్దులో ఓ వివాహిత హత్య కేసులో ఆరోపణలు రావడంతో సీఐ, ఎస్ఐలను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. డిపార్ట్‌మెంటల్ విచారణలో సీఐ సైదిరెడ్డికి క్లీన్‌చిట్ రాగా తిరిగి కరన్‌కోట్ సీఐగా నియమించారు. ఇక్కడ మూడేళ్లు పనిచేసిన సైదిరెడ్డి ఆరోపణలు రాగా 2018లో సస్పెండయ్యారు. సస్పెన్షన్ ఎత్తివేత తర్వాత ఆయన హైదరాబాద్‌లో పోస్టింగ్ తీసుకున్నారు. అనంతరం సీఐగా ధారూర్‌లో పనిచేస్తున్న ఉపేందర్ వచ్చారు. వికారాబాద్ ఎస్పీకి బదిలీ అయిన యాలాల ఎస్ఐ సురేందర్‌రెడ్డి.. సీఐపై డీఐజీకి ఫిర్యాదు చేయడం, ఉపేందర్‌ను బదిలీ చేయాలని ఓ ప్రజాప్రతినిధి డీఐజీని కలవడంతో 2019లో ఉపేందర్ కూడా అటాచయ్యారు. తర్వాత కరణ్‌కోట సీఐగా వచ్చిన జలేందర్‌రెడ్డి ఎక్కువ కాలం పనిచేశారు. 2019 నుంచి 2022 వరకు వివాదాలకు తావివ్వకుండా విధులు నిర్వర్తించారనే పేరుంది. ఆయన తదుపరి సీఐగా రాంబాబు వచ్చారు. ఎన్నికల్లో ఓ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలతో బదిలీ అయ్యారు. తర్వాత సీఐగా అశోక్ వచ్చారు. ఆయనా ఆరోపణలతో బదిలీ అయ్యారు. అనంతరం సీఐగా వచ్చిన నగేశ్ ఓ హత్య కేసు విచారణలో పాల్గొన్నారు. పెద్దేముల్ ఎస్ఐ వేణు.. ఓ కేసులో అనుమానితుడిని చితకబాదడని, ఇది సీఐ నగేశ్ వైఫల్యమేనని వచ్చిన ఆరోపణలతో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే సైతం సీఐ పనితీరుపై అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. కాగా ఇక్కడ నగేశ్ 11 నెలలు పనిచేశారు. ఆయన స్థానంలో ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

అర్బన్ సీఐ బదిలీ లేనట్టే..

తాండూరులో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించడం, ఉన్నతాధికారుల అండదండలతో అర్బన్ సీఐ సంతోష్‌కుమార్ బదిలీకి బ్రేక్ పడింది. మొదట రూరల్, అర్బన్ సీఐల బదిలీకి ఉన్నతాధికారులు నిర్ణయించినట్టు సమాచారం. అయితే పెద్దేముల్ ఎస్సై ఓ బాధితుడిని చితకబాదిన నేపథ్యంలో రూరల్ సీఐపై వెంటనే వేటు పడింది. అలాగే సంగెం కలాన్, చంద్రవంచల్లో జరిగిన వర్గాపోరు ఘటనల్లోనూ నగేష్ సమర్థంగా పనిచేయలేదనే విమర్శలొచ్చాయి. సంగెంకలాన్‌లో ఘటనపై చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే చెట్టినాడ్ సిమెంట్ కర్మగార యాజమాన్యానికి సీఐ నగేష్ సపోర్ట్ చేస్తున్నాడని ఎంపీ నేరుగా విమర్శించారు. ఇదిలా ఉంటే అర్బన్ సీఐ సంతోష్‌కుమార్‌ను సైతం గతంలో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. కారణం ఏదైనా ఆయన మరలా ఇక్కడే విధుల్లో చేరారు. ప్రస్తుతం సంతోష్‌కుమార్ బదిలీ కానట్టే అని తెలుస్తోంది. అలాగే పెద్దేముల్ ఎస్ఐని బషీరాబాద్ స్టేషన్‌కు పంపుతున్నారని సమాచారం. హత్య కేసులో అనుమానితుడిని చితకబాదిన ఘటనలో ఎస్సై వేణుపై విచారణ జరిపి ఎస్పీకి నివేదించినట్లు డీఎస్పీ నర్సింగ్ యాదవ్ తెలిపారు.

పంట నష్టం.. ఆదుకోవాలని వినతి


ఇబ్రహీంపట్నం చెరువు వద్ద నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఉప్పరిగూడకు చెందిన రైతులు కోరారు. కొన్ని రోజుల క్రితం కురిసిన వరుస వర్షాలతో పెద్దవాగు సాగడంతో 40 మంది రైతులకు సంబంధించి 80ఎకరాల్లో పంటలు నీట మునిగాయని తెలిపారు. ఇక్కడ సాగుచేసిన పంటలు పూర్తిగా కోల్పోయింది చిన్న, కౌలు రైతులేనని అన్నారు. ప్రభుత్వం ఆదుకోకపోతే తమకు జీవనాధారం కష్టంగా మారుతుందని వాపోయారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

హాజరుకానున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయడానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి నేడు(బుధవారం) కందుకూరుకు రానున్నట్లు తహసీల్దార్ కె.గోపాల్ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఓటర్ల జాబితా పటిష్టంగా సిద్ధం చేయాలి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు పటిష్టంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి బీఎల్వోలు కృషిచేయాలని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునిత కోరారు. షాద్‌నగర్ మున్సిపల్ ఆఫీసులో మంగళవారం బూత్ లెవల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని, యువకులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి, గ్రామస్తులకు మత్తుపదార్థాలపై డాక్టర్ స్రవంతి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వివరాలు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.


షాద్‌నగర్ రూరల్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ


శంషాబాద్ రూరల్ : ప్రతిజ్ఞ చేస్తున్న ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

ఆదిభట్ల : మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని ప్రతిజ్ఞ చేయించారు. మేనేజర్ రమేష్, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

చేవెళ్ల/శంకర్‌పల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే దిశగా మాదకద్రవ్యాల నిరోధ ప్రతిజ్ఞ-2025 కార్యక్రమం మంగళవారం చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించారు. కమిషనర్ వెంకటేశం ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు తదితరులున్నారు.

చౌదరిగూడ/కొందుర్గు : డ్రగ్స్‌రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేద్దామని కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్, తహసీల్దార్ జగదీశ్వర్, జీహెచ్‌ఎం సునీతలు అన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ జగదీశ్వర్, డీటీ భాస్కర్, గురుకుల పాఠశాలల ప్రత్యేకాధికారి కుర్షిద్, విద్యార్థులు, టీచర్లున్నారు.

శంషాబాద్ రూరల్ : డ్రగ్స్‌రహిత సమాజం కోసం కృషి చేద్దామని ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో సీఐ బాల్‌రాజు, ఎస్సైలు శ్రీధర్, అశోక్ వర్మ, అర్షద్ అలీ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీఐ సంపతి కనకయ్య ఆధ్వర్యంలో పోలీసులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్య క్రమంలో ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : ఆరోగ్యాలను దెబ్బతీసి, కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న మాదకద్రవ్యాలను దరిచేరకుండా అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ ఏసీపీ వి.శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్, తీగాపూర్‌లో మంగళవారం రాత్రి సందర్శించి, గ్రామస్తులతో మాట్లాడారు.


ఆదిభట్ల : ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్, సిబ్బంది


కొందుర్గు : అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవీందర్


చేవెళ్ల : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- బైక్‌పై వెళ్తుండగా అడ్డుగా వచ్చిన కుక్క
- వాహనం అదుపు తప్పడంతో కిందపడి మృతి

యాచారం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతుండగా కుక్క అడ్డురావడంతో వాహనం పైనుంచి కిందపడి డీసీఎం డ్రైవర్ మరణించిన ఘటన సోమవారం రాత్రి యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గడ్డమల్లాయగూడలో చోటు చేసుకుంది. సీఐ నందీశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. యాచారం మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన అజ్జు(40) కొంతకాలంగా మంచాల మండలం చీదేడ్‌లో నివాసముంటున్నాడు. ఇబ్రహీంపట్నంలో బియ్యం సరఫరా చేసే డీసీఎం డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై చీదేడ్‌కు వెళుతుండగా గడ్డమల్లాయగూడ సమీపంలో కుక్క అడ్డురావడంతో వాహనం పైనుంచి కిందపడ్డాడు. అజ్జు తలకు బలమైన గాయమవడంతో గ్రామస్తులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. ఇంటర్‌సెప్టార్ పోలీసులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడు అజ్జుకు భార్య ఆషియా, కుమారులు అమీర్‌ఖాన్, ఫిరోజ్‌ఖాన్, కుమార్తె సోని ఉన్నారు. అజ్జు మరణంతో కుటుంబికులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదించారు. చౌదర్‌పల్లిలో విషాదచ్ఛాయలు నెలకొన్నాయి. కాగా ప్రమాదంపై మృతుడి బంధువులు అనుమానాలు వ్యక్తం చేయగా సీసీ కెమెరాలు పరిశీలించగా ఏ వాహనం ఇతన్ని ఢీకొట్టినట్లు ఆనవాళ్లు లేవని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ట్రాక్టర్ కింద పడి రైతు..

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కింద పడి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని లేమూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. వంగ ప్రవీణ్‌రెడ్డి(47) తన వ్యవసాయ క్షేత్రం నుంచి గ్రామానికి నీటిని సరఫరా చేయడానికి సోమవారం సాయంత్రం ట్యాంకర్‌లో వాటర్ నింపుకొని వస్తున్నాడు. ఈక్రమంలో రోడ్డుపై ఉన్న రాయి ఎక్కిన ట్రాక్టర్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి ముందుగానే కింద పడడంతో ట్రాక్టర్ ఇంజన్ అతనిపై పడి తీవ్ర గాయాలయ్యాయి. అపోలో ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు సీఐ సీతారాం నేతృత్వంలో ఎస్సై పరమేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బైక్‌ను ఢీకొనడంతో మాజీ ఎంపీటీసీ..

కొందుర్గు/చౌదరిగూడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై మాజీ ఎంపీటీసీ మృతిచెందిన ఘటన కొందుర్గు మండలంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ కథనం మేరకు.. మండల పరిధిలోని వెంకిర్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మాసయ్య గౌడ్(60) ఆగిర్యాల శివారులో కౌలుకు తీసుకున్న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో కొల్లూరు వైపు నుంచి జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రనగర్‌కు చెందిన నగేశ్ కారును అతివేగంగా నడుపుతూ మాసయ్యగౌడ్ బైక్‌ను ఢీకొనడంతో రక్తగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శంషాబాద్‌లోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మాసయ్య గౌడ్ మృతిచెందినట్లు తెలిపారు. ఆయన తమ్ముడి కుమారుడు ఆనంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆమనగల్లు పట్టణ సమీపంలోని ముర్తోజుపల్లి గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఈ సంఘటన చోటుచేసుకుంది. రాంనుంతల గ్రామానికి చెందిన జల్లెల్ల కొండల్ యాదవ్ విద్యార్థులను తీసుకురావడానికి ఆటోలో ఆమనగల్లుకు బయ లుదేరాడు. మార్గమధ్యలో ముర్తోజుపల్లి గేటు వద్ద ఆటో అదుపు తప్పి కారును ఢీకొంది. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న కల్వకుర్తి డిపో ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న కొండల్ యాదవ్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వెల్దండ సమీపంలోని యెన్నం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్

యాచారం/కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సీఐ సీతారాం తెలిపారు. కందుకూరు మండలం కొత్తగూడ సమీపంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో 12 బస్తాల్లో రేషన్ బియ్యం గుర్తించారు. కండ్లకుంటతండాకు చెందిన డ్రైవర్ తేజావత్ నవీన్‌ను అదుపులోకి తీసుకోగా నేదునూర్ పరిసర గ్రామాల్లో బియ్యం ప్రజల నుంచి కొనుగోలుచేసినట్లు గుర్తించారు. బియ్యాన్ని మహేశ్వరంలో విక్రయిస్తున్నట్లు నిందితుడు ఒప్పుకునట్లు సీఐ చెప్పారు. వాహనం స్వాధీనం చేసుకొని బియ్యాన్ని పౌర సరఫరాల గోదాంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాజశేఖర్ హత్య కేసులో మరో నిందితుడి అరెస్ట్

షాద్‌నగర్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లంపల్లికి చెందిన ఎర్ర రాజశేఖర్ కిడ్నాప్, హత్య కేసులో మంగళవారం మరో నిందితుడు గణేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు విడుదల చేశారు. కిడ్నాప్, హత్య కేసులో ఎల్లంపల్లికి చెందిన ప్రధాన నిందితుడు కాగుల వెంకటయ్యతో పాటు గణేశ్ పాత్ర ఉందని తెలిపారు. పరారీలో ఉన్న అతడిని చాకచక్యంగా పట్టుకున్నామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ నేతృత్వంలో గాలించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారిపై అట్రాసిటీ కేసుతో పాటు హత్య కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే ఇన్నోవా, తవేరా కారు, రెండు బైక్‌లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగుల వెంకటయ్య నకిలీ జర్నలిస్టుగా చలామణి అవుతున్నాడని, ఎవరైనా అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా వికృత కార్యకలాపాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోవమన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, ఎస్సైలు శకర్, సుశీల ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శంషాబాద్‌లోని ఎస్.బావర్చి హోటల్ ఎదురుగా లభ్యమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకొని పరిశీలించారు. కాగా, మృతిచెందిన వ్యక్తి 40-45 సంవత్సరాల వయసు ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతిచెందిన వ్యక్తికి సంబంధించి శంషాబాద్ ఆర్జీఐఏ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఇద్దరు మహిళల అదృశ్యం

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళలు అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. శంషాబాద్ మండలంలోని రాళ్లగూడ సిద్దేశ్వర కాలనీకి చెందిన మహేశ్వరి అక్టోబరు 30 నుంచి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పశ్చిమబెంగాల్‌కు చెందిన ఆదివాసి మహిళ శంషాబాద్ మండలంలోని సాతాంరాయిలోని సుమధుర లేబర్ కాలేజీ నుంచి అక్టోబరు 10 నుంచి కనిపించడం లేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అసైన్డ్ భూ వివాదం

- ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం
- హెచ్చరిక బోర్డులు మాయం
- ఉన్నతాధికారులకు నివేదిక

మంచాల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మంచాల మండల పరిధి ఆగాపల్లిలో అసైన్డ్ భూమికి సంబంధించి కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. భూ స్వాధీనానికి సంబంధించి ప్రభుత్వ అధికారులు పాతిన హెచ్చరిక బోర్డులు రాత్రికి రాత్రే మాయమవుతున్నాయి. వివరాలిలా ఉన్నాయి. ఆగాపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 192, 193లో గల సుమారు 26 ఎకరాల్లో ఎస్ఆర్ డెవలపర్స్ వెంచర్ ఏర్పాటు చేశారు. సర్వే నెంబర్ 192 అసైన్డ్ భూమి దీనికి అనుసరించే ఉంటుంది. ఈ భూముల్లో హరితహారం, పల్లెప్రకృతి వనం, వైకుంఠధామాలు ఉన్నాయి. అయితే, ఎస్ఆర్ డెవలపర్స్ అసైన్డ్ భూమిని కబ్జా చేస్తూ వెంచర్ ఏర్పాటు చేశారని ఫిర్యాదులు రావడంతో ఇటీవల భూస్వాధీనానికి సంబంధించి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే, వాటని రాత్రికి రాత్రే మాయం చేశారు. దీనిపై భూపరిరక్షణ ప్రతినిధులు గంటీల వెంకటేష్ ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రక్షణ బోర్డుల మాయంపై మంచాల తహసీల్దార్ ప్రసాద్‌రావును వివరణ కోరగా.. 6 గుంటల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని తెలిపారు. రక్షణబోర్డుల మాయం, ప్రభుత్వ ఆదేశాల బేఖాతరుపై క్షేత్రనివేదికను ఉన్నతాధికారులకు పంపడం పంపామని.. తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ


బాలికల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో సుశీంద్రరావు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పలు పాఠశాలలను మంగళవారం జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, వెంకటేశ్వరకాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. క్లాస్‌రూమ్‌లను, ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేకదృష్టి సారించి, ఉత్తమ ఫలితాలను సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్ ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకం

చేవెళ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తోందని ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు తెలిపారు. క్షేత్రసాయి పర్యటనలో భాగంగా పలుగుట్టలో మంగళవారం పర్యటించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఉద్యాన పంటల సాగుపై రైతులకు వివరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, నర్సింలు, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

చౌదరిగూడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సౌందర్య తల్లి జ్ఞాపకార్థం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ చేశారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, జీహెచ్‌ఎం సునీత, హెచ్‌ఎం లీలామోహన్ ఉన్నారు.

అయ్యప్పలకు అన్నవితరణ

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో మంగళవారం అయ్యప్ప స్వాములకు అన్నవితరణ కార్యక్రమం ప్రారంభమైంది. గురుస్వామి గిరీష్ సతీషన్‌నాయర్ ఆధ్వర్యంలో దాతలు వీరన్నపేట గ్రామానికి చెందిన గిరమోని జ్యోతిసుదర్శన్ దంపతులు పూజ చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రెటికల్ నందీశ్వర్‌లు అయ్యప్పలు హాజరైనారు.

షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మ గుట్ట అంజనేయస్వామి ఆలయంలో 22 నుంచి నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని షాద్‌నగర్ అయ్యప్ప సేవా సమితి కో-ఆర్డినేటర్ వన్నాడ ప్రకాష్‌గౌడ్ ప్రకటనలో తెలిపారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటాం

ఆమనగల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందుల్లేకుండా మార్కెట్ యార్డ్‌లో మెరుగైన వసతులు కల్పిస్తామని ఏఎంసీ ఛైర్‌పర్సన్ గీతా నర్సింహ అన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌ను మంగళవారం సందర్శించారు. యార్డ్ ఆవరణలో పెద్దఎత్తున చెట్లు పెరిగిపోయి ధాన్యం ఆరబోస్తే చెట్ల నీడతో ఎండడం లేదని ఇటీవల ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకుపోయారు. స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి ఆదేశించారు. మార్కెట్ ఆవరణలో చెట్ల తొలగింపు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందుల గూర్చి అటవీశాఖ అధికారులకు లేఖ రాశారు. దీంతో ఆమనగల్లు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జగన్‌మోహన్, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మార్కెట్ యార్డ్ ఆవరణలోఉన్న చెట్లను ఛైర్‌పర్సన్ గీతా నర్సింహ పరిశీలించారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి

మాడ్గుల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రం రైతుల ఇబ్బందులను గుర్తించి నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎంపీటీసీ పాండుగౌడ్ అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను అమల్లోకి తేవటంతో సామాన్య రైతాంగాన్ని మరింత గందరగోళంలోకి నెట్టిందని ఆయన తెలిపారు.

శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహణతో లాభాలు

షాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విధానంలో డెయిరీ నిర్వహిస్తే పాడి రైతులు అధిక లాభాలు పొందొచ్చని పీవీ నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ మాజీ రిజిస్ట్రార్ పశువైద్య విశ్వవిద్యాలయం డాక్టర్ కొండల్‌రెడ్డి అన్నారు. సోమవారం కుర్వగూడలో శాస్త్రీయ పద్దతిలో డెయిరీ సాగు-పాల ఉత్పత్తుల విలువ జోడింపుపై మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ శశికుమార్, డాక్టర్ సాహిత్యరాణిలు పాల ఉత్పత్తి ద్వారా ఖోవా, పనీర్, చన్నా, రసమలై, బసుంది, మజ్జిగ, లస్సీ, ఫ్లేవర్‌మిల్క్ వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై రైతులకు వివరించారు. మహిళా పాడిరైతులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలందజేశారు. మాజీ సర్పంచ్ సంధ్యమల్లిఖార్జున్, రైతులు యాదయ్య, శ్రీనివాస్, మహిళా పాడిరైతులు పాల్గొన్నారు.

యువజన క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

శంషాబాద్, నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా 29వ జాతీయ యువజనోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే క్రీడా పోటీల్లో శంషాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇద్దరు జిల్లా స్థాయికి, మరో ఇద్దరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మాధవరెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయికి నాజర్‌పాషా, ఫాతిమా ఎంపిక కాగా, జిల్లా స్థాయికి గణేశ్, పహీమా ఎన్నికయ్యారన్నారు. విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు.

'కేఎన్‌ఎం 1638'తో మంచి దిగుబడి

ఇబ్రహీంపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేఎన్‌ఎం 1638 వరి వంగడం మంచి దిగుబడులు ఇస్తుందని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలో పండాల శంకర్‌గౌడ్ అనే రైతు పొలంలో పండించిన వంగడాన్ని క్షేత్ర ప్రదర్శన చేశారు. మంచి దిగుబడులు, చీడ పీడలను తట్టుకునే కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారని.. అందులో ఇది కూడా భాగమన్నారు. విత్తనాలను తోటి రైతులకు అందజేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి విద్యాధరి, ఏ ఈవో శ్రవణ్‌కుమార్, రైతులు తదితరులున్నారు.

వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ


హెల్మెట్లు అందజేస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్, దశరథ్ నాయక్, జీఎల్ఎన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి

కడ్తాల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన యువకులు తుప్పరి రాజు, సిద్దిగారి మహేశ్‌లు గతేడాది హెల్మెట్లు లేని కారణంగా బైక్‌పై నుంచి పడి మృతి చెందారు. వారి జ్ఞాపకార్థం, వేరొకరు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదని అవగాహన కల్పించేందుకు జీఎస్ఆర్ యువసేన ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దివంగత రాజు, మహేశ్‌ల స్నేహితులు పెద్ద ఎత్తున హెల్మెట్లు తీసుకువచ్చి వాహనదారులకు పంపిణీ చేశారు.

మంత్రి శ్రీహరిని కలిసిన గిరిజన సంఘాల నేతలు



కడ్తాల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని మంగళవారం కడ్తాల్ మండల గిరిజన నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీకి వెళ్తున్న మంత్రిని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమానాయక్ ఆధ్వర్యంలో నాయకులు మంత్రికి గిరిజన సమస్యలపై వినతి పత్రం అందించారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.నాయకులు నరేశ్‌నాయక్, జగన్, శంకర్, హరిచంద్ నాయక్ తదితరులు ఉన్నారు.

సీపీ సుధీర్‌బాబుకు ఎమ్మెల్యే కసిరెడ్డి అభినందనలు

ఆమనగల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభినందించారు. అబ్దుల్లాపూర్‌మెట్ బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రూ.1.07 కోట్ల చోరీ కేసును సైబరాబాద్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. మంగళవారం సీపీని కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లిగుండు తండాకు చెందిన సభావట్ పీక్లి, మక్తమాదారంనకు చెందిన ఎండీ జహీరాబేగంలు ఇటీవల మృతిచెందారు. మృతుల కుటుంబాలను మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పరామర్శించారు. రూ.5 వేల చొప్పున వారికి ఆర్థిక సాయం అందజేశారు.

ఫర్టిలైజర్ గోదాంను ఏర్పాటు చేయొద్దని వినతి

కడ్తాల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నివాస గృహాల మధ్య ఫర్టిలైజర్ గోదాంను ఏర్పాటు చేయొద్దని కడ్తాల మండల కేంద్రంలోని న్యూ కెనరా బ్యాంక్ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి అల్లాజీలను కలిసి కాలనీ నాయకులు వినతిపత్రం అందజేశారు. న్యూ కెనరా బ్యాంక్ కాలనీలో ఓ ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకుడు ఇళ్ల మధ్య స్థలాన్ని కొనుగోలు చేసి నివాస గృహం కాకుండా ఫర్టిలైజర్ గోదాం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. కాలనీలోని నివాస గృహాల మధ్య గోదాం ఏర్పాటుతో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వాపోయారు.

జనావాసాల మధ్య వైన్‌షాపు వద్దంటూ స్థానికుల ఆందోళన


రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న స్థానికులు

శంషాబాద్ రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య వైన్‌షాపు వద్దంటూ మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేశ్ ఆధ్వర్యంలో రాళ్లగూడ రోడ్డుపై మంగళవారం ఆందోళన నిర్వహించారు. వైన్‌షాపు ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యతో పాటు మహిళలకు ఇబ్బందులు తప్పవని వాపోయారు. వైన్‌షాపు వద్దని నాలుగు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌కు, ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, శంషాబాద్ నుంచి షాబాద్ వెళ్లాల్సిన వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. సీఐ బాల్‌రాజ్ వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోపాల్‌యాదవ్, మాజీ వార్డు సభ్యుడు కె.సతీశ్ తదితరులున్నారు.

దళితులకు రక్షణ కల్పించాలి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని దళితులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎల్లంపల్లికి చెందిన ఎర్ర రాజశేఖర్ పరువు హత్యను ఖండిస్తూ, మంగళవారం షాద్‌నగర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ప్రేమ వివాహాలు చేసుకుంటే దళితులకు చంపుతారా అని ప్రశ్నించారు. ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చర్య తీసుకోవాలని, రాజశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలన్నారు. రాజునాయక్, శ్రీనునాయక్, బీసా సాయిబాబు, ఈశ్వర్ తదితరులున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లిలో జరిగిన పరువు హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపారు. దళిత యువకుడు చంద్రశేఖర్ కులాంతర ప్రేమ వివాహం చేసుకుంటే అతడి సోదరుడిని హత్య చేయడమనేది కుల దురహంకారానికి నిదర్శనమన్నారు.

అంతర్జాతీయ విద్యా సదస్సుకు రవీందర్‌రెడ్డి


విద్యా సదస్సులో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో మంగళవారం ప్రారంభమైన అంతర్జాతీయ విద్యా సదస్సుకు షాద్‌నగర్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. సదస్సులో అమెరికా, ఇంగ్లాండ్, లండన్ తదితర దేశాల్లో కొనసాగుతున్న విద్యా విధానంపై ప్రదర్శనలు ప్రారంభమయ్యాయని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రోబో టీచర్లతో విద్యాబోధనపై ప్రదర్శన ఇచ్చారని, ప్రాథమిక స్థాయి నుంచే సాంకేతికతను వాడుకోవాలని పలు దేశాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ముందుకొస్తే శిక్షణ ఇచ్చి లండన్ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా అవకాశం కల్పిస్తామని ఆ దేశ ప్రతినిధులు చెప్పారన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆమనగల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముర్తోజుపల్లిలో హనుమాన్ దేవాలయ పునర్‌నిర్మాణానికి గ్రామానికి చెందిన మెడికల్ అండ్ పబ్లిక్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. మంగళవారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా దేవాలయ కమిటీ సభ్యులకు చెక్కును అందించారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన సాయిరెడ్డిని ఎమ్మెల్యే, స్థానికులు అభినందించి సన్మానించారు. మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ గీతానర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, వీరారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, అల్వాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల గుర్తింపు

తలకొండపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్‌లో మంగళవారం 2025-26 సంవత్సరానికి ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టే పనుల గుర్తింపుకు గ్రామసభ నిర్వహించారు. ఈజీఎస్ కూలీలు, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.